



నివాళులర్పిస్తున్న నాయకులు

అంకెల గారడీ

కేంద్ర బడ్జెట్ ప్రతి సారి లాగే ఈ సారి కూడా అంకెల గారడీగానే ఉంది. ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రస్తావన ఉన్నా నిధుల కేటాయింపుపై స్పష్టత లేదు. జిల్లాకు ఒరిగింది ఏమీ లేదు. మొత్తంగా జిల్లా వాసులను కేంద్ర బడ్జెట్ నిరాశ పరచింది...

- జిల్లాకు ఒరిగింది శూన్యం
- నిరాశపరచిన కేంద్ర బడ్జెట్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/విలేకరులు



ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. రూ.48,20,512 కోట్లు బడ్జెట్ అంచనా వ్యయంగా పేర్కొన్నారు. రూ.11,11,111 కోట్లు మూలధన వ్యయంగా ప్రకటించారు. కేంద్ర బడ్జెట్‌లో కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్ విద్యుత్, నీరు, రోడ్లు వంటి సదుపాయాల కల్పనకు నిధులు కేటాయిస్తామన్నారు. ఎంత ఇస్తారనేది స్పష్టతనివ్వలేదు. వెనకబడిన జిల్లాలకు ప్యాకేజీ ఇస్తామని పేర్కొన్నారు. ఎంత ఇస్తారనేది స్పష్టత లేదు. ట్రిపుల్ఐటి డిఎం అభివృద్ధికి నిధులు ఇస్తామన్నా ఎంత ఇస్తారనేది స్పష్టత లేదు.

రైల్వేపై చిన్నచూపు...

రైల్వే ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చిన్నచూపు చూస్తోంది. కొత్త రైళ్లు, కొత్త రైల్వే లైన్లకు ఒక్క పైసా కూడా కేటాయించడం లేదు. కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ నుంచి విజయవాడ మీదుగా మచిలీపట్నం వరకూ గతంలో రైలు ఉండగా దాన్ని రద్దు చేశారు. దాన్ని తిరిగి నడపాలన్న డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది. కాచిగూడ నుంచి గుంటూరుకు నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును విజయవాడ వరకూ పొడిగించాలన్న ప్రజల ఆకాంక్ష నెరవేరలేదు. కర్నూలు నుంచి నంద్యాలకు వెళ్లాలంటే డోన్ మీదుగా వెళ్లాల్సి వస్తుండటంతో సమయం ఎక్కువ పడుతోంది. కర్నూలు నుంచి ఓర్వకల్లు, పాణ్యం మీదుగా నంద్యాలకు కొత్తగా రైల్వే లైన్ వేస్తే ప్రయాణ సమయం తగ్గిపోనుంది. జిల్లాలోని పుణ్యక్షేత్రాలను కలిపేలా మంత్రాలయం కర్నూలు – శ్రీశైలం కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎన్నో ఏళ్లుగా ఉంది. బడ్జెట్లో వీటి ప్రస్తావన ఏ మాత్రం లేకుండా పోయింది.

కోచ్ ఫ్యాక్టరీకి శూన్యం...

కర్నూలు సమీపంలో ఏర్పాటు చేయనున్న రైల్వే కోచ్ తయారీ ఫ్యాక్టరీకి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు శూన్యమే. మహబూబ్ నగర్ జిల్లా పరిధిలోని అలంపూర్ రోడ్డు, కర్నూలు జిల్లా పరిధిలోని ఇ.తాండ్రపాడు, పంచలింగాల పరిధిలో ఈ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రూ.562 కోట్లతో 123 ఎకరాల్లో దాని ఏర్పాటు పనులను ప్రారంభించారు. అవసరమైన స్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో ఈ రైల్వే కోచ్ ఫాక్టరీ పనులు ముందుకు సాగడం లేదు.

టిడిపి, జనసేన కళ్లు తెరవాలి



కేంద్ర బడ్జెట్ చూసిన తర్వాత నైనా టిడిపి, జనసేన కళ్ళు తెరవాలి. బడ్జెట్‌లో మాటల్లో చూపిన శ్రద్ధ కేటాయింపుల్లో లేదు. టిడిపి, జనసేనలు బిజెపికి మద్దతిచ్చి ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు కాబట్టి రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని ఆశించే ప్రజలకు నిరాశ మిగిల్చింది. అమరావతి నిర్మాణం కోసం రూ.15 వేల కోట్లు నేరుగా గ్రాంటుగా ప్రకటించకుండా వివిధ సంస్థల ద్వారా అప్పుగా ఇప్పిస్తానని చెప్పడం హాస్యాస్పదం. దీనివల్ల ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న రాష్ట్రానికి మళ్లీ ఆర్థిక ఊబిలోకి నెట్టడమే అవుతుంది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, విభజన హామీల అమలు కట్టుబడి ఉంటామని చెప్పిన మంత్రి నిధులు ఎందుకు కేటాయించలేదు. ప్రత్యేక హోదా, కడప ఉక్కు, విభజన హామీల ఊసే లేదు. బెంగళూరు హైదరాబాదు పారిశ్రామిక కారిడారని బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించినా దానికి ఎందుకు నిధులు కేటాయింపు చేయలేదు. రాష్ట్రాలకు నిధులు కేటాయించినా, ఆంధ్రప్రదేశ్, తెలుగు రాష్ట్రాల ప్రస్తావన లేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, టిడిపి, జనసేన కేంద్రంపైనా, బిజెపిపైనా రాజకీయ ఒత్తిడి తేవాలి. బడ్జెట్‌లో మాటలతో సంతృప్తి పడకుండా స్పష్టమైన నిధులు సాధించాలి. జిల్లా ప్రజలు కేంద్రాన్ని, బిజెపిని నిలదీయాలి. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వాములైన టిడిపి, జనసేనలపై ఒత్తిడి తేవాలి. పార్లమెంటులో మన రాష్ట్ర ఎంపీలు బడ్జెట్‌లో న్యాయం కోసం పోరాడాలి.

- డి.గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి.

ప్రాంతీయ వివక్షతో వచ్చిన బడ్జెట్



కేంద్ర బడ్జెట్‌లో సమాఖ్య స్ఫూర్తి కనిపించదు. రాజకీయ లబ్ధి కోసం సరళంగా, ఉదారంగా కేటాయింపులు ఉన్నాయి. ఎపికి తొలిసారిగా ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యత దక్కింది. ప్రతి జిల్లాకు సంవత్సరానికి 50 కోట్ల గ్రాంటు మంజూరు కాబోతున్నది. మానవ వనరుల అభివృద్ధి, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన, మౌలిక అవస్థాపన సౌకర్యాల కల్పన, సంక్షేమ పథకాలకు ప్రాధాన్యతనిచ్చారు. మధ్యతరగతి వర్గాలకు వేతనజీవులకు పెద్దగా ఊరట లభించలేదు. ఓర్వకల్ మెగా పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి చెందనున్నది. సూరత్ – చెన్నై పారిశ్రామిక కారిడార్ వల్ల కర్నూలు నగరము లబ్ధి పొందనున్నది. జాతీయ రహదారుల అభివృద్ధి, వెనుకబడిన జిల్లాలకు వచ్చే గ్రాంటు వల్ల, కర్నూలు జిల్లాకు మేలు జరగనుంది.

- ఆచార్య మన్సూర్ రహమాన్, ఆర్థిక వేత్త, మానవశక్తి పరిశోధన కేంద్రం, కర్నూలు.

రాష్ట్రానికి బ్రహ్మాండమైన ప్రాధాన్యత



కేంద్ర బడ్జెట్ రాష్ట్రానికి బ్రహ్మాండమైన ప్రాధాన్యత ఇచ్చింది. ఇంత పెద్ద బడ్జెట్ రాష్ట్రానికి ఇచ్చిన చరిత్ర గతంలో లేదు. ఇది కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషితోనే సాధ్యం అయింది. బడ్జెట్లో రాయలసీమ ఉత్తరాంధ్ర తో పాటు ప్రకాశం జిల్లాల వెనుకబాటును నుంచి అభివద్ధి పథంలోకి నడిపేందుకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ అభినందనీయం. ఉమ్మడి జిల్లా పరిధిలోని ఓర్వకల్లు అభివృద్ధిపై పార్లమెంటులో ప్రస్తావన రావడం గర్వకారణం. అమరావతికి రూ.15వేల కోట్లు రావడం చరిత్రలో మైలురాయి. పోలవరం పూర్తిచేసేందుకు రూ.16 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించడం హర్షనీయం.

- బస్తిపాటి నాగరాజు, కర్నూలు ఎంపీ.

రాష్ట్రానికి తీరని అన్యాయం



ఎన్‌డిఎ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీగా ఉంది. రాష్ట్రానికి ప్రత్యేకంగా నిధుల కేటాయింపు కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వము ఉన్నా బడ్జెట్లో మాత్రం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. ఓర్వకల్, కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్‌కి ఎంత నిధులు ఇస్తారనేది చెప్పలేదు. ఈ బడ్జెట్‌లో కబుర్లు మాత్రమే చెప్పారు. వెనకబడిన ప్రాంతాలకు గ్రాంట్స్ అంశంపై ఎక్కడా స్పష్టత లేదు.

- కె.బాబూరావు, డిసిసి అధ్యక్షులు.

హోదాను సాధించడంలో విఫలం



రాష్ట్రం అభివృద్ధి కావాలంటే ప్రత్యేక హోదాతోనే సాధ్యపడుతుంది. ప్యాకేజీలతో అది సాధ్యం కాదు. ప్యాకేజీ వల్ల కొంత మేరకే అభివృద్ధి అవుతుంది తప్ప పరిపూర్ణ స్థాయిలో అభివృద్ధి అవదు. టిడిపి నాయకులు ప్రత్యేక హోదాని సాధించడంలో విఫలమయ్యారు. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రభావితం చేసే స్థాయిలో టిడిపి ఉన్నా దాన్ని సాధించలేకపోయింది. ఇది టిడిపి వైఫల్యానికి నిదర్శనం. ప్యాకేజీ వల్ల కేవలం అమరావతి అభివృద్ధి అవుతుందే తప్ప పెద్దగా ప్రయోజనం లేదు.

- ఎంఎ హఫీజ్ ఖాన్, మాజీ ఎమ్మెల్యే.

నిధులు కేటాయించకపోవడం బాధాకరం



వెనుకబడిన ప్రాంతమైన రాయలసీమ జిల్లాల అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం బాధాకరం. వెనుకబడిన ప్రాంతానికి అన్యాయం చేశారు. రాజధాని అమరావతికి నిధులు కేటాయించడం మంచిదే అయినప్పటికీ, కరువు జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి అభివృద్ధికి పాటుపడి ఉంటే బాగుండేది.

- బి.గిడ్డయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి.

బాలికలు, మహిళలపై ఆగడాలను అరికట్టాలి

- కెప్టెన్ లక్ష్మీ సెహగల్ వర్ధంతి సభలో పి.నిర్మల

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మైనర్ బాలికలపై అత్యాచారాలు హత్యలు లాంటి ఆగడాలను అరికట్టాలని శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఆర్ఎంకె ప్లాజా నారాయణ జూనియర్ కళాశాలలో కెప్టెన్ లక్ష్మీసెహగల్ వర్ధంతి సందర్భంగా ఐద్వా జిల్లా కోశాధికారి పిఎస్.సుజాత అధ్యక్షతన 'మహిళలు బాలికలపై అత్యాచారాలను, హత్యలను నివారిద్దాం' అంశంపై సదస్సు నిర్వహించారు. పి.నిర్మల, నారాయణ కళాశాల వైస్ ప్రిన్సిపల్ రేవతి మాట్లాడారు. లక్ష్మీసెహగల్ 1938లో మద్రాసు వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ గైనకాలజీ పూర్తయిన తరువాత 1940లో సింగపూర్ వెళ్ళి, అక్కడ భారతీయ నిరుపేదల వాడలో వైద్యశాల స్థాపించి, స్థానికంగా ఉన్న భారతీయ కార్మికులకు సేవలందించారన్నారు. అక్కడే నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రసంగాలకు ప్రభావితురాలై స్వాతంత్ర్యోద్యమంలో 'ఆజాద్ హింద్ ఫౌజ్ ' మహిళాదళాల్లో చేరి, కెప్టెన్ హోదా పొంది, డాక్టర్‌గా వైద్యసేవలు కూడా అందచేశారన్నారు. ఆయన స్థాపించిన ఇండియన్ నేషనల్ ఆర్మీ ఆధ్వర్యంలోని ఝాన్సీ రెజిమెంట్‌కు ప్రాతినిధ్యం వహించారన్నారు. లక్ష్మీ సెహగల్ 1947లో లాహోర్‌కు చెందిన కర్నల్ ప్రేమ్ కుమార్ సెహగల్‌ను లాహోర్‌లో వివాహం చేసుకొని కాన్పూర్‌లో స్థిరపడ్డారని, కాన్పూర్ ప్రజలకు వైద్యసేవలందించారన్నారు. స్వాతంత్ర్య అనంతరం ఆల్ ఇండియా డెమొక్రటిక్ ఉమెన్స్ అసోషియేషన్ (ఐద్వా) ఉపాధ్యక్షురాలిగా వివిధ స్థాయిలలో సమాజ సేవకు అంకితమయ్యారన్నారు. 1971లో సిపిఎం తరపున లక్ష్మీ సెహగల్ రాజ్యసభ సభ్యురాలిగా ఎన్నికయ్యారన్నారు. కెప్టెన్ లక్ష్మీ సెహగల్ స్ఫూర్తితో పోరాడి నేటి సమాజంలో మహిళలపై, బాలికలపై జరుగుతున్న హత్యలు అత్యాచారాలు దాడుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. డ్రగ్స్, అశ్లీలత విచ్చలవిడిగా పెరిగిపోవడం వల్లే ఇలాంటి అఘాయిత్యాలకు కారణం అవుతున్నాయన్నారు. డ్రగ్స్, అశ్లీలత పై ఉక్కు పాదం మోపాలన్నారు. లక్ష్మీ సెహగల్ బతికి ఉన్నంతవరకు తన జీవితాన్ని పోరాటాలకు, సేవ చేయడానికి ఉపయోగించారని, ఆమె స్ఫూర్తితో మనమందరం ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల రాజకీయ

కక్ష సాధింపులు తగదు

- ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.నరసింహులు డిమాండ్ చేశారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. యూనియన్ నాయకులు పెద్దరాజు నాయక్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.నరసింహులు మాట్లాడారు. ప్రభుత్వం మారినప్పుడల్లా ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించే ప్రయత్నం కొనసాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఆరుగురు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. వారి ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లు గత 18 సంవత్సరాలుగా పనిచేస్తున్న వారిని కూడా రాజీనామా చేయించడానికి ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు పిఎస్ రాధాకృష్ణ, ఎండి అంజిబాబు ఫీల్డ్ అసిస్టెంట్ల ధర్నాకు సంఘీభావం తెలియజేస్తూ ఫీల్డ్ అసిస్టెంట్లు పట్ల రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదన్నారు. తొలగించడానికి ప్రయత్నం చేస్తే ఆందోళనలు ఉదతం చేస్తామని హెచ్చరించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు యూనియన్ జిల్లా కార్యదర్శి వీరేష్‌గౌడు, కోశాధికారి వీరేష్ జిల్లా నాయకులుబాలు, విశ్వనాథ్, మహబూబ్, రామాంజి ,అర్జున్, మునిస్వామి, వీరేష్, స్వామి దాస్, గిడ్డయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు



జాయింట్ కలెక్టర్‌కు అభినందన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళుతున్న సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకష్ణ పుష్పగుచ్చం ఇచ్చి అభివందనలు తెలిపారు. ఈ సందర్భంగా జి రామకృష్ణ మాట్లాడుతూ 2021నుండి ఇప్పటివరకు జిల్లాలో రైతాంగ సమస్యలపై తమ పరిధిలో ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కారం కోసం ప్రయత్నం చేశారన్నారు. ఉల్చాల, బసాపురం, నూతనపల్లె, కేతవరం భూములు కోల్పోయిన రైతుల పట్ల సానుకూలంగా స్పందించి కింది అధికారులకు తమ ఆదేశాలు ఇచ్చి పరిష్కారం కోసం ప్రయత్నం చేసిందని ఆయన తెలిపారు .దూపాడు గ్రామంలో సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని కింది అధికారులకు ఆదేశాలిచ్చి పరిష్కారం చేయమని చెప్పారని తెలిపారు. జాయింట్‌గా కలెక్టర్ పదవి బాధ్యతలు తీసుకున్నప్పటినుంచి కింది అధికారులతో మంచిగా మెలుగుతూ తప్పులను హెచ్చరిస్తూ తమ పని చేస్తూ ఇతర అధికారులను పని చేయించే మంచి స్వభావం కలిగిన అధికారి అని కొనియాడారు. రామకృష్ణతోపాటు కె. దస్తగిరి పాల్గొన్నారు.


జాయింట్ కలెక్టర్ రిలీవ్

తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ ఆయన జిల్లా జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య మంగళవారం తన ఉద్యోగ బాధ్యతలు నుండి రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ విధుల నుండి రిలీవ్ అయి జిల్లా కలెక్టర్కు నివేదించారు. ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ గా జిల్లా కలెక్టర్ వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్‌ను రెవెన్యూ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

ఎరువుల లారీ బోల్తా

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- సి బెళగల్



కర్నూలు నుండి సి బెళగల్ ఎరువుల లోడుతో వస్తున్న లారీ సి బెళగల్ కస్తూరిబా పాఠశాల వద్ద మలుపులో అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ కు, క్లీనర్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదు. అక్కడ జరిగిన సంఘటన చూస్తే ప్రాణ నష్టం తీవ్ర స్థాయిలో ఉంటుందన్న తీరు దర్శనమిస్తోంది. తృటిలో ప్రమాదం తప్పడంతో అక్కడ వాహన దారులు, పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.ఇక్కడే ఎస్సై తిమ్మారెడ్డి ,పోలీస్ సిబ్బంది వెళ్లి పరిస్థితిని పరిశీలించి చర్యలు చేపట్టారు.

మందుబాబులకు అడ్డాగా తెలుగుతోట పార్కు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో పార్కులను అభివృద్ధి చేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు అణువుగా వాకింగ్ ట్రాక్ పిల్లలకు ఆడుకునేందుకు వ్యాయామం చేసుకునేందుకు కావలసిన పరికరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికి ఇంకా కొన్ని ప్రాంతాల్లో రక్షణ వలయాలు లేక కబ్జాలకు గురి అవుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో కంపచెట్లు పరిసర ప్రాంతాల్లోని మురుగు కాల్వల నీరు చేరి పందులకు నిలయాలుగా మారుతున్నాయి. పాములు కూడా సంచరిస్తున్నాయి. వాటిని కూడా శుభ్రం చేసి ఆ ప్రాంత ప్రజలకు పార్కులను అభివృద్ధి చేసి అప్పచెప్పాలి. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి పార్కులకు రక్షణ గోడలు నిర్మించి స్థలాలను కాపాడాల్సిన బాధ్యత ఉంది. మద్దూరు సుబ్బారెడ్డి నగర్ కాకతీయ పబ్లిక్ స్కూల్ వెనుక ఉన్న పింగళిసూరన తెలుగు తోట పార్కు నిర్వాహకుల నిర్లక్ష్యంతో మందుబాబులకు అడ్డగా మారింది. పార్కులు పిల్లలు ఆడుకోవడానికి వయోవృద్ధులు నడిచేందుకు, ఏర్పాట్లు చేసి అన్ని విధాలుగా మనుషుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఏర్పాటు చేస్తున్నారు. తెలుగు తోట పార్క్‌లో వాచ్మెన్‌గా ఉన్న వారి కనుసన్నల్లో అసాంఘి కార్యక్రమాలు కూడా జరుగుతున్నట్లు పరిసరాలు గమనిస్తే అర్థమవుతుంది. పార్కు చుట్టూ పరిసరాలు కూడా సమీపంలోని మాంసం అంగళ్ళకు సంబంధించిన వృధా నీరు ,వర్షపు నీరు చేరి దోమ లకు నిలయంగా మారాయి. దీనికి తోడు పార్కు చుట్టూ మురుగు కాలువ లేకపోవడంతో వర్షపు నీరు కూడా అక్కడ చేయడంతో దుర్వాసన వెదజల్లు తుంది. ఈ కారణంగా అక్కడి పరిసర ప్రాంతాల నివసించే వారికి దోమల బెడద ఎక్కువైంది. ఎప్పుడో ఒకసారి మున్సిపల్ కార్మికులు పాగింగ్ చేయడానికి వచ్చినప్పుడు మాత్రమే ఆరోజు దోమలు కొద్దిగా తగ్గుతాయి. మళ్లీ యధామామూలు అవుతాయి. దోమల కాటుకు మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా లాంటి రోగాల బారిన పడి ప్రజలు ఆసుపత్రిల పాలవుతున్నారు. పార్కులో ఉదయం పూట వాకింగ్ చేసేందుకు కూడా అనుమతించడం లేదు. దీనితో ప్రజల ఆరోగ్యాలు చెడుపోతున్నాయి.





పార్కులో తాగిపడేసిన మందుబాటిళ్లు

కాల్వలు లేవు-ఆర్ లక్ష్మణరావు, లక్ష్మీ నగర్

మరుగునీటితో వాసన భరించలే కున్నాం. తెలుగు తోట పరిసర ప్రాంతాల్లో మురుగు కాలువ లేకపోవడంతో నీరంతా రోడ్లపై నిలిచి దుర్వాసన వెదజల్లుతుంది. రాత్రిపూట దోమలకు నిద్ర లేకుండా పోతుంది. దోమల కోసం జట్టు బిళ్ళలు, ఆల్ అవుట్ కొన్న వాటికోసం డబ్బులు వెచ్చించిన దోమలు వాటి కూడా అలవాటు పడిపోతున్నాయి. దోమల నివారణకు మా ప్రాంతంలో తరచూ ఫాగింగ్ చేసి, మురికి కాలువలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పార్కు నిర్వహణపై శ్రద్ధ తీసుకుంటాం
జెంఎస్ఆర్ కె శర్మ, తెలుగు తోట పార్కు నిర్వాహకులు

తెలుగు తోట పార్కులో జరుగు అసాంఘిక కార్యక్రమాల గురించే నాదృష్టికి రాలేదు. మందు బాబులను నియంత్రించేందుకు తగిన శ్రద్ధ తీసుకొని పార్కుఅభివృద్ధికి కషి చేస్తాం. పార్కులో పాడైపోయిన పిల్లల వస్తువులను కూడా బాగు చేయిస్తాం. చుట్టూ పరిసర ప్రాంతాలు నీరు నిలవకుండా ఉండేవిధంగా మున్సిపల్ అధికారులకు , కాలువలు ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశాం. త్వరలో మురుగు కాలువలు ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

బాలుని చికిత్సకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-వెల్దుర్తి : వెల్దుర్తికి చెందిన కురువ శీను, మమతల కుమారుడు (1) నిశాంత్ మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ సోమవారం రాత్రి అకస్మాత్తుగా కోమాలోకి వెళ్లారు. విషయం తెలుసుకున్న టిడిపి యువ నాయకుడు సుధాకర్ గౌడ్, పత్తికొండ ఎమ్మెల్యే శ్యాం బాబుకు విషయం తెలపడంతో ఆయన ఆదేశాల మేరకు బాలున్ని సోమవారం రాత్రి తన సొంత వాహనంలో కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌కు తీసుకొని వెళ్లారు. అనంతరం బాలుని తల్లిదండ్రులకు చికిత్స కొరకు రూ.25 వేల నగదును అందజేశారు. చికిత్స కొరకు బాలునికి అయ్యే ఖర్చును పత్తికొండ ఎమ్మెల్యే, మిత్రుల సహకారంతో చికిత్స చేయిస్తామని తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు.

డంపు యార్డును పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి-గూడూరు: గూడూరు నగర పంచాయతీలో డంపుయార్డును ఆర్‌డిఒ శేషి రెడ్డి మున్సిపల్ నగర పంచాయతీ కమిషనర్ రవి కుమార్ రెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చుట్టుపక్కల ఎస్‌సి కాలనీ పడమర బిసి కాలనీ ఉండడంతో ఆ వార్డుకు సంబంధించిన ప్రజలు అక్కడున్న డంపుయార్డు అక్కడి నుంచి తొలగించాలని చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామంలో ఉన్న తాగినీటి సమస్యలను వీధుల గుండా తిరిగి ఆవార్డులో ఉన్న ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ముఖ్యంగా వర్షాకాలం రావడంతో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేయాలని బ్లీచింగ్ పౌడర్ చల్లి దుర్వాసన రాకుండా చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం ప్రతి విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలన్నారు. మున్సిపల్ ఎఇ నరసింహులు, రవి కుమార్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.



గూడూరులో డంపుయార్డును పరిశీలిస్తున్న ఆర్‌డిఒ



రోడ్డుకిరువైపులా ముళ్లకంప తొలగింపు

ప్రజాశక్తి- క్రిష్ణగిరి

మండల కేంద్రమైన క్రిష్ణగిరి పంచాయతీ రామకృష్ణాపురం గ్రామంలో గురువారం గ్రామ సర్పంచి దామోదర్ నాయుడు ఆధ్వర్యంలో రహదారికి ఇరువైపులా రహదారి మూసుకుపోవడంతో వచ్చిపోయే వాహనాలకు ఇబ్బందికరంగా ఉండడంతో పెరిగిన పిచ్చి మొక్కలు ముళ్ల కంపలు తొలగించారు. గ్రామస్తులు రాకపోకల అవసరాలు రిత్యా పిచ్చి మొక్కలు ముళ్ల కంపలోపెరగడంతో గ్రామ సర్పంచి జెసిబి సహాయంతో పనులు చేయించారు. ఈ సందర్భంగా రామకృష్ణాపురం గ్రామ ప్రజలు సర్పంచి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి దామోదర్ నాయుడు, బి.చంద్ర, చక్రపాణి నాయుడు, బాలప్ప నాయుడు, వెంకటేష్ శివ పాల్గొన్నారు.



పశువులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

పశువుల గర్భకోశ వ్యాధులకు చికిత్సాశిబిరం

ప్రజాశక్తి-మద్దికేర

రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద పశువుల గర్భకోశయ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వ హిస్తున్నట్లు ఎడి రవి ప్రకాష్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పెరవలి పశువుల ఆసుపత్రిలో పశు వులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎదకు రాని పశువులకు, చూడి కట్టిన పశువులకు, రెండు, మూడు, సంవత్సరాలు పైబడి ఎదకురాని పశువులకు, మినరల్ మిక్సర్స్ టాబ్లెట్స్ కూడా ఇచ్చామన్నారు. దాదాపు 62 పశువులకు చికిత్స చేసినట్లు తెలిపారు. దూడల నట్టల నివారణ, సంబంధిత మందులు తాపించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశువుల ఆసుపత్రి మండల వైద్యాధికారి కృష్ణానాయక్, డాక్టర్ లక్ష్మన్న, డాక్టర్ వెంకటేష్, విఎల్ఒ అరుణ కుమారి, తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్రకు స్వల్పంగా తగ్గిన వరద

- 82,205 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ప్రజాశక్తి - హోళగుంద

తుంగభద్ర డ్యామ్‌కు వరద స్వల్పంగా తగ్గింది. ప్రస్తుతం రోజుకు 82,205 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. మంగళవారం దిగువకు 9,149 క్యూసెక్కుల నీటిని నదికి, హెచ్‌ఎల్‌సికి 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు కూడా జారీ చేశారు. తుఫాను ప్రభావంతో అధిక వర్షాలు కురుస్తుండడంతో గత రెండు రోజులుగా రోజుకు 1,24,129 క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రస్తుతం 82,205 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోందని బోర్డు సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు. ప్రస్తుతం తుంగభద్ర డ్యామ్‌లో 96 టిఎంసిల నీటి నిల్వ ఉంది.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోండి

- సామాజిక తనిఖీ గ్రామసభలో ప్రజలు

ప్రజాశక్తి- దేవనకొండ



గుండ్లకొండలో సామాజిక తనిఖీ గ్రామసభ

మండలంలోని గుండ్ల కొండ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ సుధాకర్ అక్రమాలకు పాల్పడి ఉపాధి హామీ పనులు కల్పించడంలో విఫలమైనట్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. మంగళవారం గ్రామ సచివాలయంలో సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏపీడీ పకీరప్ప, ఎస్ఆర్‌పి ఆవులయ్య, సిఎల్ఆర్‌సి కోర్స్ డైరెక్టర్ ప్రదీప్ నాయక్, ఎపిఒ కృష్ణమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఆర్‌పి లక్ష్మయ్య సామాజిక తనిఖీ వివరాలను వివరించారు. ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామంలో పండ్ల తోటల పెంపకంలో రైతులకు సక్రమంగా బిల్లులు చెల్లించలేదని, జాబ్ కార్డు కోసం కూలీలతో డబ్బులు డిమాండ్ చేసినట్లు, ఉపాధి పనికి రాకుండా బిల్లులు చేసినట్లు తెలిపారు. టిడిపి నాయకులు రామదాస్ గౌడ్, వైసిపి నాయకులు గఫూర్ పాల్గొన్నారు.

పారిశుధ్య నివారణకు చర్యలు

- ఇన్‌ఛార్జ్ ఇఒఆర్‌డి బాలన్న

ప్రజాశక్తి - చిప్పగిరి



పరిసరాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మండలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపడుతున్నామని చిప్పగిరి ఇన్‌ఛార్జ్ ఇఒఆర్‌డి బాలన్న తెలిపారు. మంగళవారం డేగలపాడు గ్రామంలో పంచాయతీ కార్యదర్శి నరసింహులు ఆధ్వర్యంలో పారిశుధ్య నివారణపై గ్రామస్తులకు, మహిళలకు, పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించి, పారిశుధ్య పనులు చేయించారు. ప్రభుత్వ పాఠశాలలో భోజన వసతి, నీటి సౌకర్యం, తదితర అంశాలను పరిశీలించారు. అలాగే గ్రామంలో మురుగు నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ ప్రజలు రోగాల బారిన పడకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అన్ని గ్రామాల్లో అంటువ్యాధులు సోకకుండా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఎంపిడిఒ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. విద్యార్థులు పాఠశాలలోనే కాక ఇంటి వద్ద కూడా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని భోజనం ముందు ప్లేట్లను, చేతులను సబ్బుతో కడుక్కోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంట్లో ఈ విధంగా పాటించే విధంగా చూసుకోవాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు.

ఆంధ్రా సరిహద్దుకు చేరిన తుంగభద్ర నీరు

ప్రజాశక్తి - కౌతాళం



పూజలు చేస్తున్న అధికారులు

తుంగభద్ర జలాశయం నుంచి విడుదల చేసిన నీరు ఎల్ఎల్‌సి 250 కెఎం వద్దకు మంగళవారం వచ్చింది. ఎల్ఎల్‌సి ఇఇ శైలేశ్వర్, డిఇ సైఫుల్లా, ఎఇ రంగస్వామి హనవాల్ వద్ద జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ ఏడాది రైతులకు మంచి పంటలు పండాలని, జిల్లాలోని గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కారం కావాలని ఆకాంక్షించారు. పీర్ సాబ్, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనమందించాలి

- 'నాగనాథనహళ్లి'ని తనిఖీ చేసిన సబ్ కలెక్టర్
- ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం, తనిఖీలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పిల్లల భోజనంలో నాణ్యతను పెంచి విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందజేయాలని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ సూచించారు. మండలంలోని నాగనాథనహళ్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల, పంప్ హౌస్, చెరువు, గ్రామంలో ఉన్న తాగునీటి ట్యాంకులను ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ ఆకస్మికం తనిఖీ చేశారు. మంగళవారం మండలంలోని నాగనాథనహళ్లి గ్రామంలో ప్రభుత్వ మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను చూసి పరిశీలించారు. అలాగే తరగతి గదిలో విద్యార్థుల చదువును, వారి నైపుణ్యాలను గమనించారు. పాఠశాలను పరిశీలించి పరిశుభ్రతకు ప్రాధాన్యతను ఇవ్వాలని ఆదేశించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

గ్రామంలో శానిటేషన్ పరిశీలన

నాగనాథనహళ్లి గ్రామంలో శానిటేషన్‌పై సబ్ కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలోని మురుగుకాల్వల్లో పేరుకుపోయిన చెత్తను చూసి పంచాయతీ సెక్రటరీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే రోగాలు రాకుండా ఉంటాయని సూచించారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న సేవల గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు.

పంపుహౌస్, చెరువు, తాగునీటి పరీక్షల తనిఖీ

గ్రామంలోని పంపుహౌస్, చెరువు, తాగునీటి పరీక్షలను తనిఖీ చేసి పరిశీలించారు. రోజూ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు గ్రామాల్లో తాగునీటికి సంబంధించిన పరీక్షలను ఎప్పటికప్పుడు పరిశీలించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

పౌర సరఫరాల గోడౌన్ పాయింట్ తనిఖీ

ఆదోని పౌర సరఫరాల గోడౌన్ పాయింట్‌ను సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న రేషన్ నిల్వ, రికార్డులు, భద్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బియ్యం కార్డుదారులకు పంపిణీ చేసే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. తహశీల్దార్ హసీనా సుల్తానా, డిఎల్‌డిఒ నాగేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ వలీ బాష, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖాసీం, ఇస్వి ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుండమ్మ కుటుంబానికి పరామర్శ

నాగనాథనహళ్లి గ్రామంలో ఈనెల 12న భూ వివాదంలో దళిత మహిళ గుండమ్మ హత్య జరిగిన నేపథ్యంలో వారి ఇంటికి వెళ్లి గుండమ్మ కుటుంబాన్ని సబ్ కలెక్టర్ పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ... ఘటనకు పాల్పడిన వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డీఎస్పీ శివ నారాయణ స్వామి, తహశీల్దార్ హసీనా సుల్తానా, ఇస్వి ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.



గుండమ్మ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

సమన్వయ సమావేశానికి హాజరు కావాలి

- డిప్యూటీ కమిషనర్ వెంకటేష్

ప్రజాశక్తి - కౌతాళం



శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణ మాసోత్సవాలను విజయవంతం చేయడానికి సమన్వయ సమావేశం ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ వెంకటేష్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ఉరుకుంద పుణ్యక్షేత్రంలో డార్మెటరీ హాలులో ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ అధ్యక్షతన వివిధ శాఖాధిపతులతో సమన్వయ సమావేశం బుధవారం 11 గంటలకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

పైపులైన్‌కు మరమ్మతులు

- ప్రజాశక్తి వార్తకు స్పందన



పైపు లైన్‌కు మరమ్మతులు చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - ఆదోని

'ఇలా ఉంటే రోగాలు రావా' అన్న శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు మంగళవారం అధికారులు స్పందించారు. పట్టణంలోని 19వ వార్డు దివాకర్ రెడ్డి నగర్‌లో మురుగునీటి కాలువలో తాగునీటి పైపులైను ఏర్పాటు చేశారు. పైపునకు రంధ్రాలు ఏర్పడడంతో మురుగునీరు కలిసి కుళాయి ద్వారా ఆ నీరే సరఫరా అవుతున్నాయి. స్పందించిన మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి కింది స్థాయి ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసిస్టెంట్ ఇంజినీర్ రాజశేఖర్ రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్, శానిటేషన్ సెక్రటరీ నర్సప్పలు హుటాహుటిన ఘటన స్థలానికి వెళ్లి పారిశుధ్య కార్మికులతో పరిసరాలను పరిశుభ్రం చేసి పైపులైన్‌కు మరమ్మతులు చేయించడంతో సమస్య పరిష్కారమైంది. సత్వరమే అధికారులు స్పందించి సమస్య పరిష్కారం కావడం పట్ల ఆ వార్డు ఇన్‌ఛార్జీ శ్రీనివాస్ ఆచారి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తలు అవసరం

- విద్యుత్ ఎస్ఇ ఉమాపతి

ప్రజాశక్తి - ఆదోని

వర్షాకాలం విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఎస్ఇ ఉమాపతి సూచించారు. మంగళవారం ఆదోని డిఇ కార్యాలయంలో విద్యుత్ శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాలు కురుస్తుండడం వల్ల అక్కడక్కడ ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగి ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఎప్పటికప్పుడు విద్యుత్ తీగలను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలన్నారు. వినియోగదారులు తీగలు తెగినప్పుడు వారే మరమ్మతులు చేసుకోకుండా జాగ్రత్తలు పాటించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. మొండిబకాయిలపై దృష్టి సారించి వంద శాతం వసూలయ్యేలా చూడాలని సూచించారు. విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్ పేమెంట్లలో సందిగ్ధత లేకుండా వారిని చైతన్య పరచాలని తెలిపారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులందితే స్పందించి విద్యుత్ శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం ఆయా ప్రాంతాలవారీగా ఎఇలతో వివరాలను సేకరించారు. కలెక్షన్లలో వెనుకబడిన వారిని మెరుగుపరచుకోవాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ రాఘవులు, డిఇ రాజేష్, పురుషోత్తం, ఖాజా, స్వరూప్, రాఘవేంద్ర, ఎఇలు నాగభూషణం, సంతోష్, నరసన్న, చెన్నయ్య, లోకేష్, ఉలిగప్ప ఉన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్ఇ ఉమాపతి

సమన్వయంతో ముందుకెళ్దాం

- జిల్లా టిడిపి అధిష్టానం ఆలూరుపై దృష్టి పెట్టాలి
- టిడిపి కర్నూలు పార్లమెంటరీ కార్యనిర్వహక కార్యదర్శి రామదాసు గౌడ్

ప్రజాశక్తి - దేవనకొండ




ఆలూరు నియోజకవర్గం టిడిపి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకెళ్దామని, ఆలూరు నియోజకవర్గంపై జిల్లా టిడిపి అధిష్టానం దృష్టి పెట్టాలని టిడిపి కర్నూలు పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి రామదాస్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గెలుపోటములు సహజమని, ఆలూరులో టిడిపి ఓటమి చెందడానికి నాయకులను, కార్యకర్తలను బాధ్యులను చేయడం తగదని తెలిపారు. నియోజకవర్గంలో ఎవరు ఇన్‌ఛార్జ్ ఉన్నా అందరూ కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని కోరారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కూడా అన్ని మండలాల టిడిపి కన్వీనర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి మండలాల్లోని సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేసేలా పని చేయాలని తెలిపారు.

ఇష్టానుసారంగా విధులకు

- సమయపాలన పాటించని ఏరూరు సచివాలయం
- పంచాయతీ కార్యదర్శి పనితీరుపై డిఎల్‌పిఒ ఆగ్రహం
- విధుల ఉల్లంఘనపై మెమో జారీ
- డిఎల్‌పిఒ పనితీరుపై మండల ప్రజల హర్షం

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరిస్తూ ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్న ఏరూరు సచివాలయ ఉద్యోగుల పనితీరుపై మండల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమయపాలన పాటించరని, ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్నారని విమర్శిస్తున్నారు. విషయం తెలుసుకున్న విలేకరులు మంగళవారం ఏరూరు సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఉదయం 11 గంటలైనా సచివాలయ తలుపులు తెరచుకోకపోవడంతో నివ్వెరపోయారు. అధికారులు విధులకు ఏ విధంగా హాజరవుతారో తెలుస్తుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. డిపిఒకు, పత్తికొండ డిఎల్‌పిఒకు ఫొటోలు పంపి సమాచారం అందించారు. విధులకు గైర్హాజరు, విధుల పట్ల నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తున్న, సమయపాలన పాటించని పంచాయతీ కార్యదర్శిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎందుకు సమయపాలన పాటించడం లేదని, కార్యదర్శితో పాటు సిబ్బంది కూడా 11 గంటలైనా విధులకు ఎందుకు హాజరు కాలేకపోతున్నారని లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని డిఎల్‌పిఒ పంచాయతీ కార్యదర్శికి మెమో జారీ చేశారు. విధుల పట్ల అలసత్వం వహిస్తున్న అధికారులు విధులు సక్రమంగా నిర్వహించాలంటే ఉన్నతాధికారులు ఇలాంటి చర్యలు తీసుకోవాలని ప్రజలు చర్చించుకుంటున్నారు. సమయపాలన పాటించడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఇఒఆర్‌డి బాలన్న మధ్యాహ్నం సచివాలయం చేరుకొని ప్రభుత్వ ఆదేశాలు పాటించాలని, ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని, జిల్లా పంచాయతీ ఆదేశాల మేరకు ప్రతి ఉద్యోగి విధులను పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఇష్టానుసారంగా 11 గంటలకు వచ్చి మధ్యాహ్నం 3 గంటలకు వెళితే వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో పారిశుధ్యం, డ్రెయినేజీలు, ట్యాంకులు శుభ్రం చేయించి ప్రజలు అనారోగ్యాల పాలుకాకుండా చూడాలని, ముందస్తు చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.



ఉన్నతాధికారుల ఆదేశాలతో ఏరూరు సచివాలయాన్నితనిఖీ చేస్తున్న అధికారులు

ప్రత్యేక హోదా ఊసే లేదు

- ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వీరేష్ యాదవ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్రానికి ప్రత్యేక హోదా సంజీవిని లాంటిదని, బడ్జెట్‌లో ప్రత్యేకహోదా ఊసేలేదని ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వీరేష్ యాదవ్ విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ఐదేళ్లు కాదు.. పదేళ్లు ప్రత్యేక హోదా కల్పిస్తామని తిరుపతి సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట ఇచ్చారని, ఇచ్చిన మాటను మరిచారని విమర్శించారు. విద్యారంగానికి బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని, విభజన హామీలు, కడప స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్లపై మాట్లాడకపోవడం దారుణమని తెలిపారు. ఈ బడ్జెట్‌పై రాష్ట్రంలోని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

నిరాశపరిచిన బడ్జెట్ : ఎస్‌టియు

ప్రజాశక్తి - ఆదోని



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వేతన జీవులను నిరాశపరచిందని ఎస్‌టియు సోషల్ మీడియా రాష్ట్ర మాజీ కన్వీనర్, రాష్ట్ర కౌన్సిలర్ జి.వీరచంద్ర యాదవ్ తెలిపారు. మంగళవారం ఆదోనిలోని కార్యాలయంలో ఆయన కేంద్ర బడ్జెట్‌పై స్పందించారు. పాత పన్నుల విధానంలో ఎలాంటి మార్పులూ చేయకుండా, కొత్త పన్నుల విధానంలో మాత్రమే మార్పులు చేయడం వల్ల వేతన జీవులకు ఎలాంటి ఊరట కలుగలేదన్నారు. సిపిఎస్ విధానంలో మార్పులు చేస్తామని చెబుతూనే పాత పెన్షన్ విధానంపై పల్లెత్తుమాట లేకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశ కలిగించిందన్నారు. ఉద్యోగుల ఇన్‌కమ్ టాక్స్‌కు సంబంధించి పాత విధానం కంటే కొత్త విధానంలో పన్ను ఎక్కువ చెల్లించాల్సి రావడంతో ఉద్యోగులు పాత విధానానికి మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ఈ సారైనా పాత విధానంలో పన్నులు చెల్లించే వారికి రాయితీ ఇస్తారని అందరూ ఆశించారన్నారు. మధ్యతరగతి ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చే విధంగా ప్రభుత్వం తక్షణమే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి దానిపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని కోరారు. పాత పన్నుల విధానంలో రూ.7 లక్షల వరకు ఎలాంటి పన్నులూ లేకుండా మినహాయింపు ఇచ్చే విధంగా పన్నులు స్లాబ్ విధానాన్ని సవరించాలని తెలిపారు. విద్యా రంగానికి బడ్జెట్‌లో 6 శాతం కేటాయించాల్సి ఉండగా, ప్రస్తుత బడ్జెట్‌లో 3.25 శాతం నిధులను కేటాయించారన్నారు.

చెట్నిహాల్లిలో పారిశుధ్య లోపం

ప్రజాశక్తి మంత్రాలయం

మండలంలోని చెట్నిహాల్లి గ్రామంలో పారిశుధ్య లోపంతో దుర్భరంగా ఉందని తహశీల్దార్ శ్రీధర్ మూర్తి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని 20 పంచాయతీలను తహశీల్దార్, ఎంపిడిఒ మునెప్ప, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వేద స్వరూప, ఇఒఆర్‌డి ప్రభావతిలు వేర్వేరుగా సందర్శించారు. కలుషిత నీరు, పారిశుధ్యం లోపం గురించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అందులో భాగంగానే గ్రామాన్ని సందర్శించి, తాగునీటిని సేకరించి పరీక్షలకు పంపుతున్నామని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ దారుణంగా ఉందని చెప్పారు. ఈ విషయంపై కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని తెలిపారు.

వ్యక్తిగత సేవలే కీలకం

- ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకల్లో ప్రముఖులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి పనులతో పాటు వ్యక్తిగతంగా చేస్తున్న సేవలే కీలకమని వైసిపి నాయకులు కొనియాడారు. మంగళవారం ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకల్లో భాగంగా స్థానిక రాఘవేంద్ర సర్కిల్‌లో కేక్ కట్ చేసి, బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, ఇన్‌ఛార్జ్ విశ్వనాథ్ రెడ్డి, సర్పంచి భీమయ్య మాట్లాడారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి తిరుగులేని నాయకుడిగా గుర్తింపు పొందారని కొనియాడారు. వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, సచివాలయ కో కన్వీనర్ రాఘవేంద్ర ఆచారి, ఉప సర్పంచి హోటల్ పరమేష్, వీరనాగప్ప, ఎంపిటిసి వెంకటేష్ శెట్టి, రామాంజనేయులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న నాయకులు

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి

ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మండలంలోని చిలకలడోన గ్రామ సమీపంలో ఉన్న కస్తూరిబా గాంధీ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన సి.ధరణిశ్రీ (516), వి.ఇందు(475)కు మొదటి బహుమతి కింద రూ.3 వేలు, రెండో బహుమతి కింద రూ.2 వేలను వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, నాయకులు జనార్ధన్ రెడ్డి అందజేశారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తామని గతేడాది ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకల సందర్భంగా వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, జనార్ధన్ రెడ్డి హామీ ఇచ్చారు. హామీ మేరకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థినులకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వచ్చే ఏడాది ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన వారికి రూ.5 వేల నగదును అందజేస్తామని తెలిపారు. మంత్రాలయం సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, సచివాలయ మండల కో కన్వీనర్ వికెసి రాఘవేంద్ర ఆచారి, చిలకలడోన వైసిపి నాయకులు వెంకటేష్, పాఠశాల ఎస్ఒ శాంతి పాల్గొన్నారు.



ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న నాయకులు

ఘనంగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - కౌతాళం

మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పుట్టినరోజు వేడుకలను వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయం ముందు నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాలనాగిరెడ్డి ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, రాజకీయ రంగంలో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ప్రజాసేవకే అంకితమైన ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. సర్పంచి పాల్ దినకరన్, ఉప సర్పంచి తిక్కయ్య, వైస్ ఎంపిపి బుజ్జిస్వామి, చౌదరి బసవరాజు, సత్యప్ప స్వామి, లంకోబా, వడ్డే రాముడు, అబ్దుల్ సమద్, వెంకటరామరాజు, భీమేష్, బాష, ఇద్రూస్, పెద్ద ఉసేని, చిన్న ఉసేని, భూపా, కెంప బాషా, ఈరన్న పాల్గొన్నారు.

రౌడూరు గ్రామంలో : మండలంలోని రౌడూరు గ్రామంలో వైసిపి నాయకులు సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైసిపి నాయకులు మల్లికార్జున రెడ్డి, సోమిరెడ్డి, నర్సారెడ్డి, కృష్ణారెడ్డి, కిష్టప్ప, నరసింహ, కృష్ణ, ఎల్లప్ప, ఆల్లయ్య పాల్గొన్నారు.



కౌతాళం : కేక్ కట్ చేస్తున్న నాయకులు



కేక్ తినిపించుకుంటున్న నాయకులు

ముమ్మరంగా ఎంహెచ్‌పిఎస్ సభ్యత్వ నమోదు

- రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్

ప్రజాశక్తి ఆదోని

ఆదోని నియోజకవర్గంలో ఎంహెచ్‌పిఎస్ సభ్యత్వ నమోదు ముమ్మరంగా సాగిందని రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ తెలిపారు. మంగళవారం వ్యవస్థాపక అధ్యక్షులు ఫారుఖ్ షుబ్లీ ఆదేశాల మేరకు ఎంహెచ్‌పిఎస్ కార్యాలయంలో ఆదోని ప్రెసిడెంట్ హసన్, వైస్ ప్రెసిడెంట్ ఆబిద్, లీగల్ అడ్వయిజర్ చాంద్ బాష ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మైనారిటీల సమస్యల పరిష్కారానికి, కులమతాలకతీతంగా సామాన్యులకు ఎంహెచ్‌పిఎస్ సేవలు అందిస్తోందని తెలిపారు. మరోవైపు ఐదేళ్ల పాటు ప్రజలకు ముఖం చాటేస్తూ పరదాల చాటున పర్యటనలు చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రతిపక్షంలో ఉంటూ పోలీసు అధికారులను దబాయిస్తున్న జగన్ రెడ్డిని చూస్తుంటే అధికారంలో ఉన్న ఐదేళ్ల పాలనలో పోలీసులను తమ అక్రమాలకు మద్దతు పలకాలని ఎంతగా వేధించి ఉంటారో, ఇతర శాఖల అధికారులను ఏ స్థాయిలో రాచిరంపాన పెట్టారో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. గొడ్డలి, కోడికత్తి ఆరోపణల చరిత్ర కలిగిన వైసిపి నాయకుల చేతిలో కర్రలు గల ఫ్లకార్డులు ఉన్నా ప్రమాదమేనని పోలీసులు భావించి, అసెంబ్లీలో అవాంఛనీయ సంఘటనలు అరికట్టేందుకు వాటిని లాక్కుని ఉండవచ్చని తెలిపారు. ఇతర రాష్ట్రాల సమస్యలపై నోరు మెదపని జగన్ రెడ్డి నేడు తన కోసం ఇతర రాష్ట్రాల పార్టీల నాయకులు మాట్లాడాలని కోరటం అయనలో గల నియంతృత్వ ధోరణికి నిదర్శనమని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన ఒంటెద్దు పోకడలు మాని ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించాలన్నారు. నాయకులు వసీమ్ సాహెబ్, జిలాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నూర్ అహ్మద్

జలజీవన్ పథకానికి రూ.77 కోట్లు కేటాయించండి

- ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని

ఇంటింటి కుళాయి (జలజీవన్ మిషన్) పథకానికి రూ.77 కోట్లు మంజూరు చేయాలని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కోరారు. మంగళవారం అసెంబ్లీ సెషన్స్ సమయంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌ను వినతిపత్రం ద్వారా కోరినట్లు ఆయన తెలిపారు. టెండర్లను పిలవాల్సిన నివేదికను సమర్పించి వివరించారు. ఆదోని అసెంబ్లీ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి అధికంగా ఉందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటి కుళాయి పథకాన్ని అమలు చేయలేక పోయారని తెలిపారు. ఆదోని మండలంలోని సుమారు 25 గ్రామాల్లో ఇంటింటి కుళాయి పథకం ప్రారంభానికి నోచుకోలేదన్నారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు నీరందించేందుకు కృషి చేయాలన్ని కోరారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో గల గ్రామీణ రోడ్ల ఏర్పాటు, మరమ్మతులకు రూ.13 కోట్లు మంజూరు చేయాలని కోరారు. మండలంలో నీటి సరఫరా కోసం 250 బోర్ వెల్స్ వేయడం గురించి కూడా ప్రస్తావించారు. మండలంలోని బసాపురం గ్రామంలో ఉన్న జగనన్న కాలనీలో ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణం కోసం రూ.2 కోట్లు మంజూరు చేయాలని కోరారు. మంత్రి పవన్ కల్యాణ్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

రిజర్వాయర్లను నీటితో నింపాలి : సర్పంచి అయ్యమ్మ

ప్రజాశక్తి - కోసిగి

మండలంలో ఉన్న గురు రాఘవేంద్ర ప్రాజెక్టు, పులికనుమ రిజర్వాయర్లకు తుంగభద్ర నది నీటితో పంపింగ్ చేయాలని కోసిగి మేజర్ పంచాయతీ సర్పంచి ఎస్.అయ్యమ్మ అధికారులను కోరారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. హోస్పేట్ డ్యామ్ నుంచి తుంగభద్ర నదికి వరద నీటిని విడుదల చేశారని, దిగువ ప్రాంతానికి వెళ్లకుండా ముందే రిజర్వాయర్లకు నీటిని పంపింగ్ చేయాలని కోరారు. రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. లేకపోతే రైతులు, ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెప్పారు. అధికారులు నిర్లక్ష్యం వహించకుండా రిజర్వాయర్లకు నది నీరు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వారంలోపు రైతులకు సాగునీరు

- మాజీ సర్పంచి ఖాసీం వలీ

ప్రజాశక్తి - నందవరం



అధికారితో మాట్లాడుతున్న ఖాసీం వలీ

వారంలోపు ఎత్తిపోతల పథకంలోని మరమ్మతులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని మాజీ సర్పంచి, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి ఖాసీం వలీ తెలిపారు. మంగళవారం మండలంలోని నది కైరావడి గ్రామంలో ఉన్న చిలుకలడోన శ్రీగురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మాచాపురం, ఇబ్రహీంపురం, కొట్టాల, నదికైరవాడి, గంగవరం, నందవరం గ్రామాలకు సాగునీరు అందక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. చివరకు ఆ ఎత్తిపోతల పథకంలో మరమ్మతులు చేయించలేని స్థితికి గత వైసిపి ప్రభుత్వం వెళ్లిందన్నారు. ఎమ్మెల్యేగా బీవీ.జయ నాగేశ్వర రెడ్డి గెలిచిన వెంటనే రైతులకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో మరమ్మతులు చేయించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారని తెలిపారు. అందులో భాగంగానే నేడు పనులను పరిశీలించినట్లు, రెండు, మూడు రోజుల్లో పనులు పూర్తయి, వారంలోపు రైతులకు సాగునీరు అందిస్తామని చెప్పారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. టిడిపి యువ నాయకులు ఎస్.బడేసాబ్ వలీ, పూలచింత గడ్డం బజారి పాల్గొన్నారు.